www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 232, బుధవారం 23-9-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**గిరిజన బాలుర హాస్టల్‌లో ఇష్టారాజ్యం?..**




7 లో..

**గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు**



5వ పేజీల్లో

## ఎస్సీ ఎస్టీ సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

అత్యాచార నిరోధక చట్టం అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష

విద్య, ఉపాధితోనే సామాజిక మార్పు సాధ్యం

బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశం

రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దామన్న ముఖ్యమంత్రి రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 22**

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి, సాధికారతను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ స్థాయి సమావేశం తొలిసారిగా నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై నమోదవుతున్న కేసుల పరిస్థితి, దర్యాప్తు పురోగతి, కోర్టుల్లో విచారణ స్థితి, బాధితులకు అందుతున్న నష్టపరిహారం, పునరావాస చర్యలు, చట్ట అమలులో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. చట్టం అమలులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు,

మిగతా 2 లో..



## ఎంజీఎం సమస్యలపై గళమెత్తిన వినయ్ భాస్కర్..

**అడ్డుకున్న పోలీసులు**

- ఆస్పత్రి పరిస్థితులు పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే
- పోలీసులతో తోపులాట.. వినయ్ భాస్కర్‌కు గాయాలు
- ఎంజీఎం సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ డిమాండ్

**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 22**

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రోగుల భద్రత, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది.



మిగతా 8 లో..

## తెలంగాణ వైభవానికి కొత్త ప్రతీకలు

- ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలపై సీఎం సమీక్ష
- ఢిల్లీ తెలంగాణ భవన్‌కు ప్రత్యేక రూపకల్పన

**హైదరాబాద్, సెప్టెంబర్ 22**

ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, శిల్పకళలకు ప్రతీకలుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయాల వాస్తు, శిల్ప వైభవాన్ని అధ్యయనం చేసి వాటి స్ఫూర్తితో నిర్మాణాలను రూపొందించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో

మిగతా 2 లో..



## మాదాపూర్ హోటల్లో యువతి మృతి మిస్టరీ

- ఓయో గదిలో అనుమానాస్పద ఘటన
- ముఖం, తలపై గాయాల గుర్తింపు
- ప్రియుడి కోసం పోలీసుల గాలింపు




2 లో..

## యాదాద్రి కొండపై మహిళ మృతి

- రోడ్డు ప్రమాదంలో ఈశ్వరమ్మ దుర్మరణం
- ఆలయ శుద్ధి వరకు దర్శనాలు నిలిపివేత

2 లో..



## రైతుల గోసలపై ఈటల విమర్శలు

- * సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
- * ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలకు ముప్పు
- * గోదావరి, కృష్ణా జలాల వినియోగంపై ఆందోళన

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 22**

రాష్ట్రంలో రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డికి కేసీఆర్‌పై కోపం ఉంటే ఆయనపై తీర్చుకోవాలని, రైతులపై చూపవద్దని వ్యాఖ్యానించారు. రైతులు ఆందోళనలు చేస్తేనే నీళ్లు విడుదల చేసే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావం గురించి ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవన్‌లో రిటైర్డ్ ఇంజనీర్లతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్యాంప్రసాద్ రెడ్డి, వెంకటేష్, సత్తిరెడ్డి, విఠల్ రావు, ఇంద్రసేనా రెడ్డి, సాంబయ్య, కర్వందర్ తదితర ఇంజనీర్లతో రాష్ట్ర జల వనరుల పరిస్థితిపై చర్చించినట్లు తెలిపారు.

మిగతా 2 లో..





## రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై మంత్రి పరిశీలన

- శిశువుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- కుటుంబ సభ్యులకు మంత్రి భరోసా
- భద్రతా చర్యలపై అధికారులతో సమీక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌యూ)లో సోమవారం రాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర వైద ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నర్సింహ మంగళవారం ఆసుపత్రిని సందరిచారు. ఘటన అనంతరం చేపట్టిన సహాయక చర్యలు,

మిగతా 2 లో..

## రబీ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేయాలి



అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు

సాగునీరు, మౌలిక వసతులపై సమీక్ష

**ఖమ్మం, సెప్టెంబర్ 22**

ఖమ్మం నియోజకవర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతజౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ

మిగతా 2 లో..

## రామచందర్ రావు నిర్బంధంపై విమర్శలు

- జూరాల రైతులకు సంఘీభావం కోసం పర్యటన
- జడ్చర్ల వద్ద అడ్డుకున్న పోలీసులు.. బీజేపీ నేతల ఆగ్రహం వ్యక్తం



**హైదరాబాద్, సెప్టెంబర్ 22**

జూరాల ప్రాజెక్టు వద్ద నీటి సమస్యపై ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళున్న తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును జడ్చర్ల వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్న ఘటన రాజకీయ చర్చకు దారితీసింది. ఈ చర్యపై బీజేపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. బీజేపీ నాయకుల

మిగతా 2 లో..

# మాదాపూర్ హోటల్లో యువతి మృతి మిస్టరీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 22**

మాదాపూర్‌లోని ఓ ఓయో హోటల్‌లో యువతి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. విశాఖపట్నానికి చెందిన షారన్ నిఖిత టోప్పో (23) అనే యువతి తన స్నేహితుడు శ్రీనివాస రవితేజతో కలిసి హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరూ మాదాపూర్ సిద్ధిఖీ నగర్ రోడ్డు నంబర్ 5లో ఉన్న ఓ హోటల్‌లోని 303వ గదిలో దిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోలీసుల వివరాల ప్రకారం, యువతిని ఆమెతో వచ్చిన వ్యక్తి మరియు హోటల్ సిబ్బంది కలిసి చికిత్స కోసం కొండాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు యువతి ముఖం, తలపై తీవ్ర గాయాలు మరియు వాపులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. గాయాల స్వభావం, వాటికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతికి గల అసలు కారణాన్ని పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిర్ధారించనున్నట్లు పేర్కొన్నారు. యువతి మరణించిన విషయం తెలిసిన అనంతరం ఆమెతో వచ్చిన శ్రీనివాస రవితేజ ఆసుపత్రి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఆసుపత్రి సిబ్బంది దృష్టికి చిక్కకుండా అక్కడి నుంచి వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం ఉందని పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనకు సంబంధించి హోటల్ గదిని పరిశీలించిన పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. గది గోడలపై, బెడ్ షీట్లపై రక్తపు మరకలు కనిపించినట్లు గుర్తించారు. హోటల్‌లోని నిఘా దృశ్యాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. అక్కడికి వచ్చిన వారి కదలికలు, గదిలో జరిగిన పరిణామాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు మాదాపూర్ పోలీసులు తెలిపారు.

# యాదాద్రి కొండపై మహిళ మృతి

**యాదాద్రి, సెప్టెంబర్ 22**

యాదగిరిగుట్ట కొండపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందడంతో ఆలయంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈశ్వరమ్మ అనే మహిళను ఓ కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గురైన మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కొండపై వేగంగా దూసుకొచ్చిన కారు ఈశ్వరమ్మను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల దృశ్యాలు, ఇతర ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

ఆలయ నియమావళి ప్రకారం కొండపై మరణం సంభవించిన నేపథ్యంలో ఆలయ ద్వారాలను మూసివేశారు. భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి ఆలయ అధికారులు శాస్త్రోక్త విధానాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం దర్శనాలను పునరుద్ధరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కొంతసేపు ఆలయ పరిసరాల్లో విషాద వాతావరణం నెలకొంది.



# రామచందర్ రావు నిర్బంధంపై విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం, జూరాల ప్రాజెక్టు పరిధిలో నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను పరామర్శించి వారి సమస్యలు తెలుసుకునేందుకు రామచందర్ రావు పర్యటన చేపట్టారు. అయితే మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకుని ముందుకు వెళ్లకుండా నిరోధించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై స్పందించిన బీజేపీ నేతలు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలపై స్పందించే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ చర్య అప్రజాస్వామికమని ఆరోపించారు. జూరాల ప్రాంత రైతులు సాగునీటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రాజెక్టులో నీటి లభ్యత, సాగునీటి పంపిణీ, రైతుల అవసరాలు వంటి అంశాలపై ఇప్పటికే వివిధ వర్గాలు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నాయి. రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరమని స్థానికులు కోరుతున్నారు. రైతుల పక్షాన తాము నిలబడతామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. అన్నదాతల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యమాలు, నిరసనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో వెనక్కి తగ్గబోమని తెలిపారు. ఈ ఘటనపై అధికారుల నుంచి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. జూరాల ప్రాంతంలో నీటి సమస్యలు, రైతుల ఆందోళనలు, రాజకీయ పార్టీల స్పందనల మధ్య ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# ఎస్సీ ఎస్టీ సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

(మొదటి పేజీ తరువాయి)

మొబైల్ కోర్టుల పనితీరు, జిల్లా స్థాయిలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, బాధితులకు అందుతున్న సేవలపై అధికారులు సమగ్ర నివేదికను సమర్పించారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఘటనలు నమోదవుతున్నందున ప్రత్యేక దృష్టి అవసరమని అభిప్రాయపడ్డారు. కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని అధికారుల నివేదికలో వెల్లడైంది. ఈ గ్రామాల్లో సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అంశాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, సంక్షేమ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి సమస్యలను ప్రారంభ దశలోనే పరిష్కరించాలని ఆదేశించారు. అత్యాచార ఘటనలకు గురైన బాధితుల విషయంలో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం, పునరావాసం, ఉపాధి, విద్యా సహాయం వంటి అంశాలు ఆలస్యం కాకుండా అందించాలన్నారు. ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న కొన్ని కీలక ఘటనలను సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడం ద్వారా ఇటువంటి ఘటనలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి కూడా ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని, గృహాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక సాధికారతకు దోహదపడే కార్యక్రమాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. అట్టడుగు వర్గాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై కూడా యువత దృష్టి సారించాలని సూచించారు. సమాజంలో అసమానతలు తగ్గాలంటే విద్యాభివృద్ధి అత్యవసరమని, ప్రతి కుటుంబం తమ పిల్లలను చదువులో ప్రోత్సహించాలని కోరారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభ్యున్నతి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం ప్రతి పౌరుడి హక్కని గుర్తుచేశారు. వెనుకబడిన వర్గాల సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధి కోసం అవసరమైన అన్ని చర్యలను మరింత బలోపేతంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు.

# రబీ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. బుగ్గవాగు ఎత్తిపోతల పథకం పనులను తక్షణమే ప్రారంభించి, బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా కాలువలకు అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందించాలని స్పష్టం చేశారు.

మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. డ్రైనేజీ డిజైన్లు, పునరావాస ప్యాకేజీ ప్రణాళికలను త్వరగా ఖరారు చేసి వచ్చే వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగునీరు, తాగునీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని, లీకేజీల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

ఖమ్మం నగరంలో కేబుల్ బ్రిడ్జి, రహదారుల విస్తరణ, మెడికల్ కళాశాల హాస్టల్, పరిపాలన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అక్టోబర్ నెల నుంచి అన్ని మంజూరైన పనులు ప్రారంభమయ్యేలా సెప్టెంబర్ చివరి నాటికి టెండర్లు, ఇతర ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. నీటి లభ్యత, భూగర్భ జలాలు, విద్యుత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి ఇతర పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వెలుగుమట్ల కాలనీ అభివృద్ధి, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు, విద్యుత్ మౌలిక వసతుల విస్తరణ వంటి పనులను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక

- **వాయుగుండం ప్రభావంతో రెండు రోజులు వర్షాలు**
- **ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**
- **అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 22**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం, బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. దీంతో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు, మరో 20 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం రానున్న 12 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. విపత్తు నిర్వహణ బృందాలు, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖలను అప్రమత్తం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా రవాణా, విద్యుత్ సరఫరా, వ్యవసాయ కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి ప్రవాహాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# తెలంగాణ వైభవానికి కొత్త ప్రతీకలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ మేరకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యుత్ లైన్ల మార్పు, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ మార్పిడి, తాగునీటి సరఫరా మార్గాల సర్దుబాటు, వాగుల ప్రవాహాల మళ్లింపు, రహదారుల విస్తరణ వంటి అంశాలపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఈ వివరాలను పరిశీలించిన ముఖ్యమంత్రి పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు.

ప్రతి శాఖ విడివిడిగా పనులు చేపట్టడం వల్ల ఆలస్యాలు, అదనపు వ్యయాలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, విద్యుత్, రహదారులు, తాగునీటి సరఫరా, నీటిపారుదల, సమాచార వ్యవస్థలకు సంబంధించిన శాఖలు ఒకే వేదికపై చర్చించి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని, అభివృద్ధి పనులు సమగ్రంగా సాగాలని సూచించారు. విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో వాగులు, సహజ నీటి ప్రవాహాల మార్పు అవసరమైతే పర్యావరణ సమతుల్యతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అవసరమైతే విమానాశ్రయ ప్రాంగణం లేదా సమీప ప్రాంతాల్లో చెరువులను అభివృద్ధి చేసి, అక్కడి నుంచి నీటి ప్రవాహాలను మళ్లించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి లక్ష్యాలను సమన్వయం చేయాలని చెప్పారు.

విమానాశ్రయాలకు చేరుకునే రహదారులు విశాలంగా ఉండేలా చూడాలని, జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులతో నేరుగా అనుసంధానం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీ తెలంగాణ భవన్‌కు సంబంధించిన రూపకల్పన నమూనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రతి నిర్మాణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ కళా వైభవం ప్రతిబింబించేలా పలు మార్పులను సూచించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, కిరణ్ చామల, విప్ బీర్ల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై మంత్రి పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

శిశువుల తరలింపు ప్రక్రియ, ప్రస్తుత పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువులను సురక్షితంగా ఇతర వార్డులకు తరలించిన విధానాన్ని మంత్రి పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది, అధికారులు సమన్వయంతో వ్యవహరించిన తీరును తెలుసుకున్నారు. శిశువుల భద్రతకు తీసుకున్న చర్యలపై వివరాలు సేకరించారు.

ప్రస్తుతం చికిత్స పొందుతున్న శిశువులు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, ప్రతి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని వైద్య బృందాన్ని ఆదేశించారు. అవసరమైతే అదనపు వైద్య సదుపాయాలు కూడా కల్పించాలని సూచించారు. అగ్నిప్రమాదంతో ఆందోళనకు గురైన చిన్నారుల కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. శిశువుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆసుపత్రిలోని అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితుల్లో అమలు చేసిన విధానాలను మంత్రి పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు, భద్రతా ప్రమాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితర అధికారులు పాల్గొన్నారు. శిశువుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర్ రాజా నర్సింహ స్పష్టం చేశారు.

# రైతుల గోసలపై ఈటల విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం మేడిగడ్డ వద్ద భారీగా నీరు సముద్రంలో కలుస్తున్నప్పటికీ ప్రభుత్వం వాటిని వినియోగించడంలో విఫలమైందన్నారు.

గోదావరి నదిలో ప్రస్తుతం నీటి మట్టం లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుకూల స్థాయిలో ఉన్నప్పటికీ నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టలేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎన్డీఎస్ఏ నివేదిక కోసం ఎదురుచూశామని ప్రభుత్వం చెప్పినా, నివేదిక వచ్చిన తరువాత కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రైతులకు, ఇంజనీర్లకు ప్రభుత్వంపై ఎలాంటి ద్వేషం లేదని, కేవలం సాగునీరు అందించాలని మాత్రమే కోరుతున్నారని చెప్పారు. కృష్ణా నది జలాల పంపిణీ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాయలసీమ ప్రాంతానికి భారీగా నీరు తరలిపోతుండగా, మహబూబ్‌నగర్ ప్రాంతంలో లక్షల ఎకరాల సాగుకు అవసరమైన నీరు అందడం లేదన్నారు. రైతులు కళ్ల ముందే నీళ్లు ఉన్నా వాటిని వినియోగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోదావరి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి, కృష్ణా జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న సమయంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఎదురవుతున్నాయని, రైతులు మళ్లీ పాత కష్టకాలాన్ని గుర్తు చేసుకునే పరిస్థితి వస్తోందని వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ నెలలోనే పంటలు ఎండిపోతున్నాయనే వార్తలు వస్తున్నాయని చెప్పారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఈటల రాజేందర్ హెచ్చరించారు. ఉత్తర తెలంగాణను ఎండబెట్టే పరిస్థితి రాకుండా చూడాలని, హైదరాబాద్‌కు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీరు, విద్యుత్, జల వనరుల నిర్వహణ అంశాల్లో ప్రభుత్వం తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని, లేకపోతే రైతులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసనను మరింత ఉధృతం చేస్తారని పేర్కొన్నారు.

# రక్తదాన సేవా కార్యక్రమాల్లో ముందంజలో అబ్దుల్ రహ్మాన్

**- ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ భద్రాద్రి జిల్లా సెక్రెటరీ జుబ్బు**





**కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. అబ్దుల్ రహ్మాన్ అలియాస్ జుబ్బు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రక్తదాతలను సమన్వయం చేస్తూ అవసరమైన వారికి సకాలంలో రక్తం అందేలా అహర్నిశలు కృషి చేస్తున్నారు. రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు యువతలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, స్వచ్ఛంద రక్తదానానికి ప్రోత్సహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రక్తదాతలను ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మొక్కలు నాటడం, వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. అబ్దుల్ రహ్మాన్ సేవలను గుర్తించి హైదరాబాద్‌లోని ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్, గుంటూరులోని గ్రేస్ లైఫ్ ఫౌండేషన్, ఆత్మకూరులోని భారత్ రక్తదానం సేవ మిషన్ ఫౌండేషన్‌ల నుంచి మూడుసార్లు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జాతీయ అధ్యక్షుడు జేబీ బాలు, గౌరవ అధ్యక్షుడు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం ఎక్కడ పుల్లయ్య, మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు, జేఏసీ చైర్మన్ వీరునాయక్, ప్రకృతి ప్రేమికుడు, ఏటీఈసీ జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, జిల్లా కార్యదర్శి రాజేష్, హనుమాన్ జిమ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ కమలాకర్‌తో పాటు స్థానికులు అబ్దుల్ రహ్మాన్‌ను అభినందించారు. రక్తదానం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు..

# నిరుపేదల ఆరోగ్యానికి కాపేడు భరోసా..

**- టేకులగూడెంలో ఉచిత వైద్య శిబిరం!**

**- 120 కుటుంబాలకు మెడికల్ కిట్ల పంపిణీ..**

**గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలపై అవగాహన**




**వాజేడు.సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్):** గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలు వైద్య సేవలకు దూరం కాకుండా వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో కాపేడు స్వచ్ఛంద సంస్థ ముందడుగు వేసింది. సంస్థ ఆధ్వర్యంలో టేకులగూడెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో గ్రామంలోని సుమారు 120 నిరుపేద కుటుంబాలకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు సాధారణ అనారోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య బృందం వివరించింది. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. పేదలకు వైద్యం దూరం కాకూడదు.. సేవలు ప్రతి గ్రామానికి చేరాలి అనే లక్ష్యంతో కాపేడు స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా మారుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులతో వైద్య సేవలు పొందలేని కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య సామగ్రి అందించడం ద్వారా కొంత మేరకు ఉపశమనం కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాపేడు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజ్, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్, టేకులగూడెం సర్పంచ్ బాలకృష్ణ, వాజేడు మండల కోఆర్డినేటర్ గొంది కామేశ్వరరావు, వెంకటాపురం మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో నిరంతరంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పేద, గిరిజన కుటుంబాలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలని గ్రామస్థులు కోరారు. టేకులగూడెంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ద్వారా తమకు ఎంతో ఉపయోగం కలిగిందని, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగించాలని కాపేడు స్వచ్ఛంద సంస్థను అభినందించారు.

# నెలన్నరలోగా రీ-సర్వే పూర్తి చేయాలి

***- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్***



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్--రామవరం--గరీబ్‌పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ-సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు అటవీ భూముల హద్దులను పరిశీలించినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు వివరించారు. సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యంగా సర్వే నంబర్ 20లో పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసి ఉన్నందున రికార్డుల ఆధారంగా ఆయా భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. పోడు సాగు భూములకు సంబంధించి అర్హులైన వారికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. రీ-సర్వే అనంతరం భూ హద్దులు స్పష్టమై, హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు. సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. పాత సరిహద్దు రాళ్లు, మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్‌ఐ గణపతి, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రామవరం రెవెన్యూ పరిధిలో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** రీ-సర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేయాలి పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూముల హద్దులను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలి కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్--రామవరం--గరీబ్ పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి, సర్వే పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ-సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేపట్టడంతో పాటు అటవీ భూముల హద్దులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల మేర అటవీ భూమి ఉన్నట్లు వివరించారు. సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 20లో పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసి ఉన్నందున ఆయా భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ భూముల హద్దులు ఇప్పటికే నిర్ధారితంగా ఉన్న ప్రాంతాల్లో అనవసర జాప్యం లేకుండా మిగిలిన రీ-సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పరిధిలో పోడు సాగు చేస్తున్న భూములు ఉన్నాయని, అర్హులైన వారికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు వివరించారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని, ఇందులో గిరిజనులు, ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రీ-సర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమై, హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ రోజు సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. అక్కడ ఉన్న పాత సరిహద్దు రాళ్లు, మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం రాష్ట్రీయ హరిత గౌరవ పురస్కారానికి ఎంపికైన బాల ప్రకృతి ప్రేమికుడు

**- అవార్డు కోసం వెళ్లే ఖర్చుతో మొక్కలు నాటుతా.. అవార్డులు కాదు పచ్చదనమే పెంచడమే ముఖ్యం**

**- తెలంగాణ బాల ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** పర్యావరణ పరిరక్షణలో తనదైన ముద్ర వేస్తూ, చిన్న వయసులోనే పెద్ద లక్ష్యంతో ముందుకు సాగుతున్న తెలంగాణ బాల ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్ కు అరుదైన జాతీయ గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక "రాష్ట్రీయ హరిత గౌరవ పురస్కార్ 2026" కు ఎంపికయ్యాడు. రాజస్థాన్ కేంద్రంగా 40 ఏళ్లుగా పర్యావరణ సేవలో తలమునకలై, కోట్లాది మొక్కలు నాటి "ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియా" గా పేరుగాంచిన శ్రీ విష్ణు లాంబా ఆధ్వర్యంలోని కల్పతరు సంస్థాన్ ఈ అవార్డులను అందజేస్తోంది. ఈ నెల 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జైపూర్ లోని కనోరియా పీజీ మహిళా మహావిద్యాలయ ఆడిటోరియం, జెఎల్ఎన్ మార్గ్ లో జరిగే "పర్యావరణ మహాకుంభ్" కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి ఎంపికైన 25 మంది ప్రకృతి ప్రేమికులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, కేంద్ర మంత్రులు, ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. గతంలో ఈ పురస్కారాన్ని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ అందుకోవడం విశేషం. ఈ పురస్కారాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ హరిబావు భాగ్డే చేతుల మీదుగా అందుకున్నారు అవార్డు కార్యక్రమంలో గతంలో మరో గవర్నర్ కల్రాజ్ మిశ్రా పాల్గొని అవార్డులు ప్రధానం చేశారు అటువంటి ప్రతిష్టాత్మక జాబితాలో చిన్నారి విశ్వామిత్ర చౌహాన్ చోటు దక్కించుకోవడం తెలంగాణకు గర్వకారణం. అయితే ఈ సందర్భంగా విశ్వామిత్ర చౌహాన్ చూపిన నిబద్ధత అందరినీ ఆలోచింపజేస్తోంది. జైపూర్ వెళ్లి రావడానికి ప్రయాణ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని, ఆ ఖర్చుతో అవార్డు కోసం వెళ్లడం కంటే, ఆ డబ్బులతో అన్ని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుతానని తనకు అవార్డులు, రివార్డులు ముఖ్యం కాదని, పచ్చదనం పెంచడమే తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశాడు. అవార్డు కంటే ఆలోచన గొప్పదన్న ఈ బాలుడి మాట నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం. అయినప్పటికీ నిర్వాహకులు విశ్వామిత్ర కోసం ప్రత్యేకంగా ప్రయాణ ఖర్చులు తాము భరించి ఆహ్వానించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. చిన్న వయసులోనే పెద్ద ఆలోచనలతో, భావి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించాలనే తపనతో ముందుకు సాగుతున్న విశ్వామిత్ర చౌహాన్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# గిరిజన భూములపై కబ్జా ఆరోపణలు..

**- అధికారులు ఇకనైనా మేల్కొనాలి!**

**- 1/70, పీసా, అటవీ హక్కుల చట్టాలు కాగితాలకే పరిమితమా?**

**- ఎడ్జర్లపల్లి( జి )సర్వే నంబర్ 25. 32.పై సమగ్ర విచారణకు డిమాండ్..**

**గిరిజనుల భూములను తిరిగి స్వాధీనం చేయాలని ఆగ్రహం**




**వాజేడు , సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు, ప్రభుత్వ భూములపై గిరిజనేతరుల ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారుతున్నాయి. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాల్సిన చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో వాటి అమలు ఏ మేరకు జరుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భూములపై వస్తున్న ఫిర్యాదులను ఫైళ్లకే పరిమితం చేయకుండా తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యంగా 1/70 భూ బదలాయింపు నిబంధనలు, పీసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం వంటి రక్షణ చట్టాలు ఉన్నప్పటికీ గిరిజనుల భూములు ఇతరుల ఆధీనంలోకి వెళు_న్నాయనే ఫిర్యాదులు రావడం ఆందోళన కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. గిరిజనుల భూములను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ.. ఫిర్యాదులు వచ్చిన తర్వాత కూడా చర్యలు ఆలస్యమైతే భూమి హక్కులు మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎడ్జర్లపల్లి ( జి) సర్వే నంబర్ 25. 32.పై అనుమానాల మబ్బులు!**

వాజేడు మండలం ఎడ్జర్లపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 25. 32.లోని భూమిపై గిరిజనేతరుల ఆక్రమణ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూమి ప్రభుత్వ భూమేనా? రికార్డుల్లో భూమి స్వరూపం ఏమిటి? వాస్తవంగా ఎవరి ఆధీనంలో ఉంది? ఎంత విస్తీర్ణంలో వినియోగిస్తున్నారు? భూమికి సంబంధించిన పట్టాలు, పహాణీలు, రిజిస్ట్రేషన్ వివరాలు, ఇతర రెవెన్యూ రికార్డులు ఏమి చెబుతున్నాయి? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే.. ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాలకు రక్షించాలని ఆదివాసీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. కేవలం కాగితాల పరిశీలనతో సరిపెట్టకుండా రికార్డుల పరిశీలనతో పాటు క్షేత్రస్థాయి సర్వే, హద్దుల నిర్ధారణ, భౌతిక పరిస్థితుల నమోదు చేపట్టాలని కోరుతున్నారు.

**గిరిజనుల పట్టా భూములు గిరిజనేతరుల చేతుల్లోకి ఎలా?**

గిరిజనుల పేర్లపై ఉన్న పట్టా భూములు గిరిజనేతరుల ఆధీనంలో ఉన్నాయనే ఫిర్యాదులు నిజమైతే.. ఆ భూముల బదలాయింపు ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎవరి అనుమతులతో జరిగింది? అనే అంశాలపై లోతైన దర్యాప్తు చేయాలని ఆదివాసీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. 1/70 నిబంధనలకు విరుద్ధంగా భూమి బదలాయింపు జరిగినట్లు అధికారిక విచారణలో తేలితే, చట్టపరమైన ప్రక్రియ ద్వారా భూములను తిరిగి గిరిజనులకు పునరుద్ధరించాలని కోరుతున్నారు. గిరిజనుల హక్కులను కాపాడాల్సిన వ్యవస్థే వారి భూముల విషయంలో నిర్లక్ష్యం చేస్తే.. చట్టాల ఉద్దేశం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

**ధ్రువపత్రాల జారీలో అక్రమాలు జరిగాయా?**

గిరిజనేతరులకు గిరిజన ప్రాంతాల్లో భూములకు సంబంధించిన ప్రొహిబిషన్ సర్టిఫికెట్లు లేదా ఇతర ధ్రువపత్రాలు నిబంధనలకు విరుద్ధంగా జారీ అయ్యాయనే ఆరోపణలు ఉంటే, వాటిపైనా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అటువంటి పత్రాలు జారీ చేయడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు విచారణలో తేలితే.. బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే ఆరోపణలు నిజమో కాదో అధికారిక రికార్డుల పరిశీలన, విచారణ ద్వారానే తేలాల్సి ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

**చట్టాలు పుస్తకాల్లో కాదు.. భూమిపై అమలు కావాలి!**

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ.. అవి క్షేత్రస్థాయిలో కఠినంగా అమలు కావాల్సిన అవసరం ఉందని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వర్గాలు అంటున్నాయి. 1/70, పీసా, అటవీ హక్కుల చట్టాలు కేవలం ఫైళ్లలో కనిపించే నిబంధనలు కాకుండా.. గిరిజనుల భూములను కాపాడే ఆయుధాలుగా పనిచేయాలని వారు కోరుతున్నారు. ఎడ్జర్లపల్లి ( జి )సర్వే నంబర్ 25 32 తో పాటు వాజేడు మండలంలోని ప్రభుత్వ, గిరిజనుల పట్టా భూములపై ప్రత్యేక బృందంతో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. భూ రికార్డులను పూర్తిగా పరిశీలించి.. అక్రమ ఆక్రమణలు లేదా నిబంధనలకు విరుద్ధమైన బదలాయింపులు ఉన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గిరిజనుల భూములను రక్షించాల్సిన అధికారులు ఇకనైనా మేల్కొనాలని, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఆరోపణపై పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వర్గాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**- కొత్తగూడెం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం**

**- ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఆర్వో పద్మావతి ఆదేశం**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, మృతులు, క్షతగాత్రుల వివరాలతో పాటు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. జనవరి 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు జిల్లాలో 370 రోడ్డు ప్రమాదాలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వీటిలో 176 మంది మృతి చెందగా, 23 మంది తీవ్రంగా, 344 మంది స్వల్పంగా గాయపడ్డారని తెలిపారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రకటన ద్వారా తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శోభాయాత్రల్లో డీజేలు, అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్, టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ




అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# వైరాలో గణేష్ మండపాన్ని సందర్శించిన మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి

**- ప్రజలకు సుఖ, సౌభాగ్యాలు కలగాలని గణపతిని కి పూజ చేసిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి**





**వైరా, సెప్టెంబరు 22, (భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ గాంధీ చౌక్ లోని శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొంగిలేటిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు అనేవి ఆనాది కాలము నుంచి, భారతీయ సంస్కృతిలో భాగంగా, ఆ గణేశుని ఆశీర్వచనాలతో ప్రజలందరూ కులమతాలకు అతీతంగా, ఆనందంగా జరుపుకునే పండుగని, మట్టి విగ్రహాలతో చేసిన వినాయకుని విగ్రహాలను చాలామంది నేటి తరంలో ఉపయోగిస్తున్నారని, అలా చేయటం వలన పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని, భవిష్య తరాలకు కలుషితమైన వాతావరణం లేకుండా మంచి సమాజాన్ని అందించగలుగుతామని, ఈ పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో, భోగభాగ్యాలతో, ఆనందంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ విఘ్నేశ్వరుని పూజించడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రి పొంగిలేటిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫైడ్ మాజీ వైస్ చైర్మన్ బుర్ర రాజశేఖర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సీతారాములు, జిల్లా నాయకులు మిట్టపల్లి నాగి, కాంగ్రెస్ నాయకులు, వార్డ్ కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**- భద్రాద్రి జిల్లాలో 2190.63 కేజీల గంజాయి సీజ్ విలువ రు. 11,20,81,500**

**- మొత్తం 219 మంది అరెస్టు, పరారీలో ముగ్గురు**

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి వివరాల వెల్లడి**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారిణి (డీ. ఆర్.ఓ) పద్మావతి అధికారులను మంగళవారం ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయములోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 2190.63 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, దాని విలువ రు. 11,20,81,500 ఉంటుందని, మొత్తం 219 మందిని అరెస్టు చేయాగా ముగ్గురు పరారీలో ఉన్నట్లు డి.ఆర్.ఓ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 65 మందిని డీ - అడిక్షన్ సెంటర్ కు తరలించినట్లు వివరాలు వెల్లడించారు. మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలుదుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గత సమావేశం నుండి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని డీ. ఆర్.ఓ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన అనే పథకంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు డి.డబ్ల్యు.ఓ స్వర్ణలత లేనినా డీ.ఆర్.ఓ కు తెలిపారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు డి.ఆర్.ఓకు తమ కార్యచరణలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్. వెంకటేశ్వర్లు, డీఈఓ కార్యాలయ అధికారి రామారావు,జిల్లా రవాణా శాఖ ఏ.ఎం. వి.ఐ శ్వేత,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి. సురక్షితమైన ఆహారం, ఆరోగ్యం ప్రధాన ఉద్దేశ్యంగా ఆహార భద్రత శాఖ నిరంతరం పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఆహార భద్రత పై సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడారు. జిల్లాలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, కల్తీపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఆహార భద్రతా అధికారి శరత్ కు సూచించారు. జిల్లాలోని ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆహార లైసెన్స్ / రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పొందాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శరత్ ఈ సందర్భంగా డీ.ఆర్. ఓ కు తెలియజేసారు. ఆహార వ్యాపార నిర్వాహకులకు లైసెన్స్, రిజిస్ట్రేషన్ పొందే ప్రక్రియను సులభతరం చేయడానికి గతంలో ఆహార లైసెన్స్ ఒ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించామని గుర్తుచేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలు, బేకరీలు, స్వీట్ షాపులు, కిరాణా దుకాణాలు, వీధి ఆహార విక్రయదారులు, ఆహార తయారీదారులు, హోల్‌సేల్ , రిటైల్ వ్యాపారులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోగా 60మందికి రిజిస్ట్రేషన్లు చేసుకోవడం వలన ఫుడ్ లైసెన్స్ మంజూరు చేసామని తెలిపారు. తమ ఎఫ్ఎస్-ఎస్ఎఐ లైసెన్స్ / రిజిస్ట్రేషన్ పొందాలని, రెన్యువల్ చేసుకోవాలని వ్యాపారులను డీ. ఆర్.ఓ సూచించారు. ప్రతి ఆహార వ్యాపారానికి ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ ఉండటం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా, వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడంలో ముఖ్యమైన భాగం" అని తెలిపారు. భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు తనిఖీలు చేపట్టి సర్వేలన్స్ శాంపిల్స్, ఎన్ఫోర్స్మెంట్ శాంపిల్స్ సేకరించి 59 నమోదు చేశామని డీ. ఆర్.ఓ లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ వైద్యులు డాక్టర్ ప్రతాప్ డీఈఓ కార్యాలయ అధికారి రాజ్ కుమార్, డిపిఓ కార్యాలయ అధికారి ఉమర్ ఫర్, ఫుడ్ అనాలసిస్ట్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- వర్షం వస్తే బురదమయంగా రహదారులు.. నిలిచిపోతున్న మురుగునీరు**

**- కాలనీ ప్రజల ఇబ్బందులు పట్టించుకోవాలి: డీవైఎఫ్ఐ**





**కారేపల్లి, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** కారేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించి, శాశ్వతంగా నీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సింగరేణి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సింగరేణి మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ.. అంబేద్కర్ నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తేలికపాటి వర్షం కురిసినా కాలనీలోని రహదారులు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయని, ఇళ్ల నుంచి వెలువడే మురుగునీటికి సరైన పారుదల మార్గం లేక వర్షపు నీటితో కలిసి రహదారులపైకి చేరుతోందని పేర్కొన్నారు.

**మురుగునీరు నిల్వ.. దోమలకు ఆవాసం**

కాలనీలో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమలు, ఈగలు పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. పారిశుద్ధ్య సమస్యతో పాటు పరిసరాల పరిశుభ్రత దెబ్బతింటోందని, చిన్నారులు, వృద్ధులు రహదారులపై నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా డ్రైనేజీ కాలువల నిర్మాణం, మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు వంటి శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. సమస్యను పట్టించుకోకుండా జాప్యం చేస్తే కాలనీ ప్రజలను సమీకరించి సమస్య పరిష్కారం కోసం ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదేర్ల నాగరాజు, సాయి, పిట్టల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

**- వైరా నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి**

**- ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**వైరా, సెప్టెంబర్ 22,( భద్రాద్రి న్యూస్ ) :** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని మంగళవారం హైదరాబాదులో నియోజకవర్గ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సహచర ఎమ్మెల్యేలతో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిన అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేయటం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైరా నియోజకవర్గానికి అవసరమైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను త్వరితగతిన, అధిక మొత్తంలో కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే మాలుతి రామదాసు నాయ క్ వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు, అభివృద్ధి ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే తో పాటు సహచర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అనంతగిరి మండల వార్డు సభ్యుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక



**కోదాడ , సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమతి నాగబెల్లి జ్యోతి మహేష్ గారి ఆదేశాల మేరకు, సూర్యాపేట జిల్లా ఇంచార్జీ షేక్ నజీర్ పాష ఆధ్వర్యంలో అనంతగిరి మండల వార్డు సభ్యుల ఫోరం కమిటీని లాటరీ పద్ధతిలో ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ అధ్యక్షులుగా తుళ్లూరి కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాసరి పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా నలమాద హరీష్, ప్రధాన కార్యదర్శిగా కొండ్రు అనిల్ కుమార్, కార్యదర్శిగా గాంధీ, సహాయ కార్యదర్శిగా ధన్వంత్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం మండల అధ్యక్షులు మిరియాల శ్రీను, మునగాల మండల అధ్యక్షులు సురేపల్లి ఉప్పలయ్య మరియు అనంతగిరి మండల పరిధిలోని వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సూర్యతండాలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

**- విఘ్నేశ్వరుడి కృపతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి**

**- గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలి: సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్**








**కారేపల్లి, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సింగరేణి మండలం సూర్యతండా గ్రామపంచాయతీలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వినాయక చవితి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విఘ్నాలను తొలగించి, శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి పూజకు ప్రత్యేక విశిష్టత ఉందని సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్ తెలిపారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. గణనాథుడి కృపాకటాక్షాలతో సూర్యతండా గ్రామంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో జీవించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు చెప్పారు. వినాయక చవితి సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ముందుకు వచ్చిన బానోత్ సాయినాథ్--సాయిబాను శ్రీ దంపతులు, వారి తల్లిదండ్రులు వీరన్న--శారద అన్నదాతలుగా వ్యవహరించారు. వారి సహకారంతో భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అన్నదానం చేయడం గొప్ప సేవా కార్యక్రమమని, భక్తుల కోసం అన్నదానానికి ముందుకు వచ్చిన అన్నదాతల సేవాభావాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులు అన్నదాతల కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, ప్రజలు, యువత, వినాయక చవితి కమిటీ సభ్యుల సహకారంతో ఉత్సవాలను ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో సూర్యతండా గ్రామం సుభిక్షంగా, సుఖశాంతులతో కళకళలాడాలని ఆకాంక్షించారు. మహా అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, అన్నదాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. భవిష్యత్తును కాపాడుకోవాలి

**– విద్యార్థులే దేశ భవిష్యత్తు.. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
**– మత్తు పదార్థాల ముప్పును తరిమికొడదాం: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి**

**కారేపల్లి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు ):** మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావం, వాటికి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతపై సింగరేణి మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి శ్రీలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరించారు.

**మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారం**
ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వేసుకునే కీలకమైన సమయమని, ఈ దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కష్టపడాలని సూచించారు. చదువుపై దృష్టి సారిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని, చెడు సావాసాలకు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఒకసారి అలవాటు పడితే విద్యార్థుల ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్షణిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ వారికి ఎప్పటికప్పుడు సరైన మార్గదర్శనం అందించాలని కోరారు.

**సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచుతాం :** సింగరేణి మండల ఎక్సైజ్ సీఐ పి. లింగయ్య మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, సరఫరా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు సమష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థుల ప్రతిజ్ఞ :** మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు తోటి విద్యార్థులను కూడా మత్తు పదార్థాల బారిన పడకుండా




చైతన్యపరుస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల ఎక్సైజ్ సిబ్బంది వీరభద్రం, వసంతకుమారి, వాణి, సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ చేయూత పింఛన్ అందేలా చర్యలు

**- దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనను పర్యవేక్షించిన సర్పంచ్ బానోత్ హీరాలాల్**



**కారేపల్లి, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పింఛన్ ప్రయోజనం అందేలా చర్యలు చేపడుతున్నట్లు భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ తెలిపారు. భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో చేయూత పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన మంగళవారం కొనసాగింది. ఈ ప్రక్రియను సర్పంచ్ హీరాలాల్ పర్యవేక్షించారు. ప్రత్యేక అధికారి, మండల నీటిపారుదల శాఖ ఏఈ ఎడిండ్ల నాగయ్య ఆధ్వర్యంలో అధికారులు దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను పరిశీలించారు. అర్హతకు సంబంధించిన పత్రాలు, ఇతర వివరాలను పరిశీలించి క్షేత్రస్థాయి ధ్రువీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ హీరాలాల్ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గత నెలలో చేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించామని, ప్రస్తుతం వాటి అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు అధికారులు అడిగే అర్హత పత్రాలు, అవసరమైన వివరాలను అందించి పరిశీలన ప్రక్రియకు సహకరించాలని కోరారు. సరైన వివరాలు, పత్రాలు సమర్పించడం ద్వారా అర్హులైన వారికి పింఛన్ మంజూరు ప్రక్రియ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెండ్రా అనిల్ కుమార్, వార్డు సభ్యుడు వాంకుడోత్ గాంధీ, పంచాయతీ సిబ్బంది హేంచంద్, రాందాస్, ఇరిగేషన్ సిబ్బంది వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గుగులోత్ మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

**- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్**
**- నియోజకవర్గ ప్రజల అవసరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే**

**కారేపల్లి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు ):** వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను అధికంగా కేటాయించి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని మంగళవారం సహచర ఎమ్మెల్యేలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గంలోని ప్రజా అవసరాలు, అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వైరా నియోజకవర్గ ప్రజల అవసరాలే ప్రధానంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక వసతులతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సిన అంశాలను వివరించినట్లు



తెలిపారు. వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను త్వరితగతిన కేటాయించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని మాలోత్ రాందాస్ నాయక్ పేర్కొన్నారు.

# భక్తిభావం సమాజ హితానికి దోహదపడాలి

**– కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** భక్తిభావం సమాజ హితానికి దోహదపడాలని, ఐక్యతతోనే ప్రగతి సాధ్యమని, ప్రజలందరికీ గణేశుడి ఆశీస్సులుండాలలని, శాంతి, సామరస్యాలతో జీవించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని రైటర్ బస్తీ త్రిమాత దేవాలయం, రామవరంలోని వానందాస్ గడ్డ, పోస్ట్ ఆఫీస్ సెంటర్, మేదరబస్తీలోని భగత్ సింగ్ కాలనీల్లో ఉత్సవ కమిటీలు నిర్వహించిన వినాయక మండపాలను ఆయన సందర్శించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, బండి నర్సింహా, కూరపాటి సుధాకర్, యూసఫ్, దినేష్, పండు, మండల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు హోమ చూర్ణం, ఆవు నెయ్యి పంపిణీ

**- గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్) :** వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గణేష్ మండపాల నిర్వాహకులకు ఉచితంగా హోమ చూర్ణం,ఆవు నెయ్యిని పంపిణీ చేస్తున్నట్లు గణేష్ నిమజ్జన కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలోని స్థానిక వివేకానంద హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయా గణేష్ మండపాల వద్ద హోమ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతీ ఒక్కరూ భక్తి భావంతో ఈ వినాయక ఉత్సవాలు జరుపుకుంటున్నారని ముఖ్యంగా యువత ఎటువంటి చెడు వ్యసనాలకు లోనూ కాకుండా మాలలు ధరించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం శుభసూచకమని పేర్కొన్నారు. నిమజ్జనం వరకు ఇదే స్ఫూర్తిని కొనసాగించి శాంతియుత వాతావరణంలో పూర్తి చేయాలని



అధికారులకు,ఉత్సవ కమిటీ వారికి సహకరించాలని కోరారు. 25వ తేదీన సాయంత్రం 3గంటల కల్లా వినాయక విగ్రహాలు ప్రకాశం స్టేడియం చేరుకోవాలని కోరారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గణేష్ ఉత్సవ కమిటీ తరఫున ఉత్సవ మండపాల నిర్వాహకులకు హోమ చూర్ణం,ఆవు నెయ్యిని ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో హోమ కార్యక్రమాలను నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తీసుకురావడం



సంతోషంగా ఉందన్నారు. గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన మండపాల నిర్వాహకులు,భక్తులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి దారా రమేష్, వందనపూ శ్రీధర్, అకిరెడ్డి మహేష్, మెరుగు చింటేశ్వర్, అగుల యాకయ్య, కుసనా సాగర్, నాగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**కోదాడ , సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్):** కోదాడ నియోజకవర్గం వర్గం పరిధిలో అనంతగిరి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కోదాడ శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు కార్డుల పంపిణీని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనంతగిరి మండల పరిధిలోని 11,289 మంది అర్హులకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బొక్కలతండాలో ఘనంగా మహా అన్నప్రసాద వితరణ

**- హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం.. పాల్గొన్న సర్పంచ్ హనుమంతరావు**



**కారేపల్లి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలం భజ్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని బొక్కలతండాలో వినాయక ఉత్సవాల సందర్భంగా హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమానికి భజ్యతండా సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు హాజరై గణనాథుడిని దర్శించుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హనుమంతరావు మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాల్లో యువత సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రాంబాబు, బబ్లూ, శ్రీరామ్, సాయి, చక్రి, లక్ష్మణ్, సిద్దు, అజ్మీరా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గాదెపాడు తండాలో భక్తిశ్రద్ధలతో అన్నదానం

**- వినాయక మండపం వద్ద భక్తులకు అన్నప్రసాదం.. సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**కారేపల్లి, సెప్టెంబర్ 23 (భద్రాద్రి న్యూస్):** సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని గాదెపాడు తండాలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విఘ్నాలను తొలగించి, శుభాలను ప్రసాదించే గణనాథుడిని భక్తితో కొలుస్తూ నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గాదెపాడు సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు, చిన్నారులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందిస్తూ రంజిత్ కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలంతా ఐకమత్యంతో పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వినాయక చవితి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేగూరి హేమంత్ కు రక్తదానంలో విశిష్ట సేవా పురస్కారం




**కోదాడ, సెప్టెంబర్ 22, (భద్రాద్రి న్యూస్):** వేగూరి హేమంత్ కు రక్తదానంలో విశిష్ట సేవా పురస్కారం లభించింది. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాతలకు పురస్కార ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కురుమేటి నవీన్, ఉపాధ్యక్షులు అన్నెపంగు బాబు ల చేతుల మీదుగా వేగూరి హేమంత్ పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) లో పిఎస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన పురస్కారాల ప్రధానోత్సవ వేడుకల్లో హేమంత్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుని రక్తదానంలో తన సేవా దృక్పథాన్ని చాటి చెప్పారు. ప్రమాదాలకు గురి అయిన బాధితులకు, పేషంట్ సర్జరీకి ఆపదలో ఉన్నప్పుడు హేమంత్ వెనువెంటనే స్పందించి హుటాహుటిన పేషెంట్ వద్దకు వెళ్లి వారికి అవసరమైన తన రక్తాన్ని దానం చేసి ప్రాణ రక్షణ చేస్తున్నారు. తనకు రక్తదానంలో పురస్కారం రావడం తన బాధ్యతను మరింత పెంచిందని హేమంత్ పేర్కొన్నారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ అధ్యక్షులు కురిమేటి నవీన్ , ఉపాధ్యక్షులు అన్నెపంగు బాబు , ప్రధాన కార్యదర్శి హేమంత్ ఈ సంస్థకు వెన్నుదన్నుగా నిలుస్తూ రక్తదాతల సేవలను గుర్తించి పురస్కారాలను అందిస్తున్నారు. ఉత్తమ రక్తదాత పురస్కారం అందుకున్న వేగూరి హేమంత్ ఇప్పటివరకు 12సార్లు రక్తదానం చేయడంతోపాటు పలుసార్లు ప్లేట్లెట్స్ ను దానం చేసి ఎందరికో ప్రాణ దాతగా నిలిచారు. ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలని, ప్రాణం పోయే స్థితిలో ఉన్న రోగులకు రక్తదానం చేసి వారికి ప్రాణదానం చేయాలని హేమంత్ పిలుపునిస్తున్నారు.

# కోదాడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి




**కోదాడ, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్):** కోదాడ పట్టణంలోని పెటిక భవన్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కోదాడ శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు కార్డుల పంపిణీని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోదాడ మండల పరిధిలోని 33,296 మంది అర్హులైన లబ్ధిదారులకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతోనే ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గిరిజన బాలుర హాస్టల్‌లో ఇష్టారాజ్యం?..

- విద్యార్థుల గోడు పట్టించుకునేదెవరు!
- విద్యార్థుల భోజనం, సరుకుల నిర్వహణపై ఆరోపణలు.. ప్రశ్నిస్తే సిబ్బంది ఆగ్రహం?
- హాస్టల్ తాళాలు ఎవరి చేతుల్లో?.. స్టాక్, హాజరు రిజిస్టర్లపై సమగ్ర తనిఖీకి డిమాండ్




**చర్ల, సెప్టెంబర్ 22 (భద్రాద్రి న్యూస్):** సత్యనారాయణపురం గిరిజన బాలుర వసతి గృహంలో విద్యార్థుల సంక్షేమం కంటే సిబ్బంది ఇష్టారాజ్యమే నడుస్తోందా? విద్యార్థులకు అందాల్సిన భోజనం, నిత్యావసర సరుకులు, వసతి సౌకర్యాల నిర్వహణపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హాస్టల్‌లో జరుగుతున్న వ్యవహారాలపై విద్యార్థులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన సిబ్బంది.. "మా ఇష్టం.. మేము చెప్పిందే" అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యార్థుల హక్కులపై నిర్లక్ష్యమా?**

ప్రభుత్వ నిధులతో నడుస్తున్న గిరిజన బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అవసరమైన సరుకులు, సురక్షితమైన వసతి కల్పించడం అధికారుల బాధ్యత. అయితే హాస్టల్‌లో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు అందాల్సిన సౌకర్యాలపై విద్యార్థులు ప్రశ్నిస్తే సిబ్బంది నుంచి నిర్లక్ష్యపూరిత సమాధానాలు వస్తున్నాయని వారు చెబుతున్నారు.

**హాస్టల్ తాళాలు సిబ్బంది చేతుల్లోనేనా?**

హాస్టల్ నిర్వహణకు సంబంధించిన తాళాలు, సరుకుల నిల్వలు, వంటశాల నిర్వహణ తదితర అంశాలపై స్పష్టత అవసరమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల భద్రతకు సంబంధించిన వసతి గృహంలో ప్రతి వ్యవహారం నిబంధనల ప్రకారం, అధికారుల పర్యవేక్షణలోనే సాగాల్సి ఉంటుంది. హాస్టల్ తాళాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? నిర్వహణ బాధ్యతలు ఎవరు చూస్తున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**సర్కారు సరుకులు.. లెక్కలు ఎక్కడ?**

హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు పూర్తిస్థాయిలో విద్యార్థులకే వినియోగిస్తున్నారా? రోజువారీ వినియోగానికి సంబంధించిన లెక్కలు సక్రమంగా నమోదవుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరుకుల వినియోగంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు బిల్లులు, సరుకుల నిల్వలు, రోజువారీ వినియోగ వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ప్రశ్నిస్తే ఆగ్రహం.. విద్యార్థుల గోడు వినేదెవరు?**

తమకు అందాల్సిన భోజనం, సరుకులు, వసతి సౌకర్యాల గురించి విద్యార్థులు ప్రశ్నిస్తే కొందరు వంట సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులే అక్కడి లబ్ధిదారులు.. వారి హక్కులను ప్రశ్నించడం తప్పు కాదు.

**అధికారులు ఇకనైనా కదలాలి!**

విద్యార్థుల ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయాన్ని తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. కేవలం కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించడం కాకుండా.. అధికారులు ఆకస్మికంగా హాస్టల్‌ను తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. స్టాక్ రిజిస్టర్లు, హాజరు రిజిస్టర్లు, సరుకుల నిల్వలు, వంటశాల, భోజన నాణ్యత, సిబ్బంది విధుల నిర్వహణ, హాస్టల్ తాళాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల కడుపు నింపాల్సిన సరుకులు ఎక్కడికి వెళ్తున్నాయి?.. హాస్టల్ తాళాలు ఎవరి చేతుల్లో ఉన్నాయి?.. విద్యార్థులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఆగ్రహం వ్యక్తం చేయాల్సిన అవసరం ఏమిటి? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరోపణల్లో వాస్తవం ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆరోపణలపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం విషయంలో రాజీ లేకుండా.. వారికి నాణ్యమైన భోజనం, సురక్షితమైన వసతి, గౌరవప్రదమైన వాతావరణం కల్పించేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



# (AIKMS)4వ జాతీయ మహాసభలను జయప్రదం చెయ్యాలి



**భద్రాద్రి న్యూస్ । :** సెప్టెంబర్28,29,30 తేదీల్లో ఖమ్మంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం **(AIKMS)**4వ జాతీయ మహాసభలను జయప్రదం చెయ్యాలని పిలుపునిస్తూ అందులో భాగంగానే ఈ రోజు ఇల్లందు డివిజన్ ప్రాంతంలో ట్రాక్టర్ల తో బారి ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాచనపల్లి గ్రామపంచాయితీ నుండి ఏఐకేఎంఎస్ నాయకులు ట్రాక్టర్ల ర్యాలీకి బయలుదేరారు. ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి మాట్లాడుతూ కేద్రం లో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని దివాళా తీపించి మూడు నల్ల చట్టాలను తీసుకోవచ్చి వ్యవసాయ రంగాన్ని బహుళ జాతి కంపెనీలకు అంబానీ, ఆదాని లకు కట్టబెడుతుంది విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రజా పోరాటం లో బాగా స్వాములు కావాలని ముఖ్యంగా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ మహా సభలకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆళ్లపల్లి మండల కార్యదర్శి బట్టు ప్రసాద్ ,ఏఐకెఎంఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమరం సత్యనారాయణ, పూనెం రంగయ్య, సర్పంచ్ జరుపుల కిషన్,మండల నాయకులు బొర్ర వెంకన్న,కొమరం సత్యనారాయణ, అటికం శేఖర్, యనగంటి చిరంజీవి ,ఇస్లావత్ రాందాస్,ఇస్లావత్ శివ నాయక్ , బొమ్మర సమ్మయ్య, జరుపల రవి, పూణెం రమేష్, పూణెం సత్యం, ఇస్లావత్ శ్రీను, గూగులోత్ నాగేష్, మలోత్ శ్రీను, భూక్యా రాములు, తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ రవాణా రేటుపై లారీ యజమానులతో ఆర్టీవో చర్చలు

– త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది : ఆర్టీవో



**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । సెప్టెంబర్ 22 :** పామాయిల్ ఫ్యాక్టరీలో పామాయిల్ రవాణా చేస్తున్న లారీ యజమానులతో ఆర్టీవో అధికారి చర్చలు జరిపారు. పార్టీ అధికారి మాట్లాడుతూ అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్ మంద నాగబాబును ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పామాయిల్ రవాణాకు లభిస్తున్న రేటు తమకు సరిపోవడం లేదని లారీ యజమానులు ఆర్టీవో దృష్టికి తీసుకువచ్చారు. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు పెరగడంతో రవాణా వ్యయం అధికమవుతోందని వారు వివరించారు.లారీల నిర్వహణ, డ్రైవర్ల ఖర్చులు తదితర అంశాలను కూడా యజమానులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆర్టీవో లారీ యజమానులతో సమస్యపై వివరంగా చర్చించారు. రవాణా వ్యవహారంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు తెలుసుకున్నారు.లారీ యజమానులు, ఫ్యాక్టరీ యాజమాన్యం మధ్య సమన్వయంతో సమస్యను పరిష్కరించేందుకు చర్చలు కొనసాగాయి. రవాణా రేటు అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపాలని లారీ యజమానులు కోరారు. తమ సమస్యకు సానుకూల పరిష్కారం లభిస్తుందని లారీ యజమానులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ మంద నాగబాబు, లారీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# అన్నదానం నిర్వహించడం గొప్ప కార్యం

- ఎస్సై శోభన్ బాబు,సర్పంచ్ పాలకూరి రమాదేవి
- పెరుమాండ్ల యాదగిరి జయమ్మ,కుమారుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



**మునుగోడు (సెప్టెంబర్ 22): (భద్రాద్రి న్యూస్):** మునుగోడు మండల కేంద్రంలోని గాంధీనగర్ 1వ వార్డులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పెరుమాళ్ల యాదగిరి – జయమ్మ దంపతులు, వారి కుమారులు ప్రమోద్ లావణ్య,ప్రణయ్ సౌమ్యశ్రీ,స్వామి,ప్రణీత్,రోహిత్ ల ఆధ్వర్యములో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్సై ఎం. శోభన్ బాబు, గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ హాజరయ్యారు. ముందుగా మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై శోభన్ బాబు మాట్లాడుతూ భక్తిభావంతో పాటు సామాజిక దృక్పథంతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామంలో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జరుపుకోవాలని సూచించారు. సర్పంచ్ పాలకూరి రమాదేవి మాట్లాడుతూ.. భక్తులకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని, ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న వినాయక యూత్ అంబేద్కర్ యువజన సంఘం,సభ్యులు ముఖ్య అతిథులను, దాతలైన పెరుమాళ్ల యాదగిరి దంపతులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిరియాల వెంకటేశ్వర్లు,గోలి చెన్న కేశవులు, గోలి మారయ్య,ముచ్చపోతుల నరసింహ,బెల్లపు శివయ్య,వనం సురేష్,అద్దంకి వెంకటయ్య,రెడ్డిమల్ల యాదగిరి,ఉత్సవ కమిటి ,అంబేద్కర్ యువజన సంఘం నాయకులు,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు భక్తులు పాల్గొన్నారు..





# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఇల్లందులో భారీ ట్రాక్టర్ ర్యాలీ

**ఇల్లందు గుండాల సెప్టెంబర్ 22 భద్రాద్రి న్యూస్:** సెప్టెంబర్ 28,29,30 తేదీలలో ఖమ్మం పట్టణంలో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు ఇల్లందు పట్టణంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కొమరారం నుండి ప్రారంభమైన ర్యాలీ మామిడిగూడెం, సీతనగరం, రొంపేడు, 21 ఫీట్,కోర్టు ఏరియా నుండి గోవింద్ సెంటర్ కొత్తబస్టాండ్, మెయిన్ రోడ్, ప్రభుత్వ హాస్పిటల్ సెంటర్ జై కే కాలనీ నుండి ఆమ్ బజార్ మీదుగా ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో ఏఐకేఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జేవి చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య మట్లాడుతూ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతులు కూలీలు ఏకమై పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు రైతులకు 12000 ఇస్తామని,వ్యవసాయ రంగాన్ని రక్షిస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని దారాదత్తం చేస్తూ నూతన వ్యవసాయ రంగ చట్టాలతో పల్లెలో నివసించే రైతులను దివాలా తీపిస్తున్నారని అన్నారు. నూతన యాప్ లను తీసుకొచ్చి ఏజెన్సీ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం వల్ల సరైన సమయానికి ఎరువులు అందకపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని, విద్యుత్తు సవరణ బిల్లు, విత్తన చట్ట బిల్లు, నూతన అటవీ హక్కుల నియమాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుటకు జరుగుతున్న ఈ మహాసభలను రైతులు కూలీలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు, కల్తి వెంకటేశ్వర్లు, రాసుద్దీన్, కొప్పుల శ్రీను,రామచందర్, పూనెం రంగన్న, కొమరం సత్యనారాయణ, పూనెం కోటయ్య, మూడు మాలు, సువర్ణపాక నాగేశ్వరరావు,పొడుగు నర్సింహా రావు, బట్టు ప్రసాద్, మోకాళ్ల రమేష్, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, మోకాల్ల కృష్ణ, జరుపుల కిషన్,ముక్తి రమేష్, చిన్న స్వామి,మోతిలాల్,వాంకుడోత్ సరోజినీ, శ్రీను, సంతు,వజ్జ మధు,జోగకృష్ణ,చిరంజీవి,బొర్రా వెంకన్న,రావూరి ఉపేందర్, అటికం శేఖర్, మండల వెంకన్న, వెంకటనర్సయ్య, బొగ్గారపు రాజు,లాజర్,రాందాస్, ఇస్లావత్ శివ నాయక్, ఉదయ్,రమేష్,భరత్, వీరన్న,వేంపెల్లి వెంకటేశ్వర్లు, దనుంజయ,సీతారామ రాజు, బాసాని వెంకటేశ్వర్లు, మంగీలాల్, కోడి పాపారావు, తుడుం శ్రీను, హార్జ్య, తదితరులు పాల్గొన్నారు.




# "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని నిర్వహించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

- తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహణ

**మునుగోడు సెప్టెంబర్ 22: ( భద్రాద్రి న్యూస్):** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ తల్లుల పేర్లతో మొక్కలను నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను స్వీకరించారు.ఈ సందర్భంగా పాఠశాల FACప్రధానోపాధ్యాయురాలు విరమళ్ళ అపర్ణ మాట్లాడుతూ.. ఆ చెట్టును చూసిన ప్రతిసారీ 'ఇది నా తల్లి పేరుతో నేను నాటిన మొక్క' అని గర్వంగా చెప్పుకునేలా దానిని సంరక్షించండి" అని సూచించారు."ఒక్క విద్యార్థి-- ఒక్క మొక్క" అనే ఆలోచనతో ముందుకు సాగాలని, ప్రతి విద్యార్థి తన స్నేహితులు, తల్లిదండ్రులు, చుట్టుపక్కల ప్రజలను కూడా మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని కోరారు. పాఠశాల ప్రాంగణంతో పాటు ఇళ్ల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో అనువైన మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు."ఈ రోజు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించే జీవనాధారం. కాబట్టి మొక్క నాటడం ఒక కార్యక్రమం మాత్రమే కాదు.. అది మన బాధ్యత. మనం నాటిన ప్రతి మొక్కను కాపాడటం ద్వారా మన తల్లికి, మన ప్రకృతికి ఇచ్చే గౌరవాన్ని చాటుకుందాం" అని అన్నారు.విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చెట్ల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం ద్వారా "తల్లి పేరుతో మొక్కను నాటుదాం.. ప్రేమతో పెంచుదాం.. ప్రకృతిని కాపాడుదాం.. భావితరాలకు పచ్చని భవిష్యత్తును అందిద్దాం" అనే సందేశాన్ని విద్యార్థులు సమాజానికి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు భవాని, నవ్య, లక్ష్మీ ప్రసన్న,నవ్య శ్రీ,శేఖర్,సునీత,వాలంటరీ ఉమా, ప్రీప్రైమరి ఉపాధ్యాయురాలు రేణుక, ఆయా అరుణ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, పద్మ,సరస్వతి, గీత,భార్గవి, ఉమా స్వరూప,తదితరులు పాల్గొన్నారు.








Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem - 507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046